# ఉద్యోగం

ఆయన వెళ్ళిపోయారు.

నిట్టూర్చాను. హృదయం బరువెక్కింది. నాకళ్ళల్లో నీళ్లు నిండుకున్నాయి. రాయిలా గుమ్మందగ్గరే నించున్నాను. ఆయన వెళ్ళిపోతూ అన్నమాటలే చెవుల్లో రింగుమంటున్నాయి.

"అమ్మ పిలుస్తోంది" అన్నాడు చిట్టి.

కళ్లు తుడుచుకుంటుండగా అడిగాడు "ఏడుస్తున్నావా"

* * *

జీవితంలో నే నేనాడూ నవ్వలేదు. నాన్న తెలీదు. అమ్మఒడిలో సుఖం తెలీదు. వాళ్ళేలా ఉండేవారోగూడా గుర్తులేదు.

నేననుకుంటాను—దేవతలాంటి అమ్మ ఆదరణ దైవుడిలాంటి నాన్న వాత్సల్యం పంచుకున్న మనిషి బతుకులో

ఏనాటికైనా నవ్వగలడూ అని. నాకా అదృష్టం లేదుమరి.

అన్నయ్య ఉన్నాడు. అయినా నేను నవ్వు కునేందుకు అవకాశ మివ్వలేదాయన. ఒదినుంది — కానీ ఆమె అమ్మ కాలేదు. కాదు! ఆ యిద్దరి చేతుల్లో పెరిగేను.

నన్ను పెంచుతూన్న అన్నయ్య పదిమందిలోనూ అవునని పించుకున్నాడు. ఒదినని చాలామంది గౌరవించేవారు. వాళ్ళిద్దరూ లోకాన్ని మాయచేయగలరు. అంతరంలోలేని ప్రేమని పదిమంది ముందూ ఒలికించగల నేర్పు వాళ్లకుంది.

నాకు చాలా గుర్తులున్నాయి. అన్నయ్య దగ్గిర అక్కయ్య కూడా పెరిగింది. హీనాతి హీనంగా పెరిగింది. మగవాడిని, ఓర్చుకోగల గుణం గలవాడినిగనక వాళ్ళఅనాదరణకి తలొగ్గేను.

అక్కయ్య తర్వాత నలుగురుపుట్టి అదృష్టవంతులై మరో లోకంలో ఉన్నారు. వాళ్ళందరి తర్వాత నేను సాంప్రదాయానికి వ్యతిరేకంగా నేనే అమ్మనీ, నాన్ననీ కొంచెం తేడాలతో పొట్టని పెట్టుకున్నాను. అందుచేతనే అన్నయ్యాకి నేనంటే కసి.

కానీ, అక్కయ్యమీద అంత అసహ్యమెందుకో తెలిసేది కాదు.

ప్రేమించిన మనిషిని పెళ్ళిచేసుకుంటానని ధైర్యంగా చెప్పడం నీచమైంది. నాకళ్ళముందే అక్కయ్యని మెడపెట్టి

గొంటి తలుపుమూసేదు అన్నయ్య. చాతకాక యేడుస్తూన్న నన్ను బరబరా లాక్కుపోయి నోరు మూయించేశు.

నా నోరు యెల్లప్పుడూ మూసుకునే ఉంటుంది. నా కోరికలు సర్వదా చంపబడుతూనే ఉంటాయి. నే నెందుకూ పనికిరాని చవటని. కాకపోతే అక్కయ్యకి అంత అవమానం జరుగుతూంటే చూస్తూ వూరుకునేవాడిని కానే కాదు

ఆ నరకంనుంచి అక్కయ్య తప్పుకున్న తర్వాత నా నెత్తిమీద బాధ్యతలబరువు రెండింతలయింది. ఇంటెడుచాకిరీ నే నొక్కడ్నే చేయవలసి వచ్చేది. వదినకి వల్లమాలిన సుస్తీ అస్తమానూ ఉండేది. ఒదిన అన్నయ్యకి మరో ప్రాణం. ఆమెకి తలనొప్పొస్తే నాకా రోజు చేతినిండా పని తగిలేది. మందుకి వెళ్ళాలి. వంటచేసి అన్నయ్యని ఆఫీసుకి పంపాలి. దానికో గంటముందునుంచీ వూపిరి సలుపుకోలేనంత ఒత్తిడి వల్ల నలిగిపోవాలి.

నేను చేసినవంట నా మొహంలా ఉంటుంటట. నా మొహం దరిద్రగొట్టు మొహమని వదినా అన్నయ్యల అభిప్రాయం. అయినా నెలకి యిరవై రోజులు నా చేతివంటే నా కావల్సొచ్చేది వాళ్ళిద్దరికీ. వండిపెట్టి నే నింత కతికి స్కూలుకి వెళ్ళేవాడిని! స్కూలునించి రావటంతోటే మళ్ళా పురమాయింపులూ, ఆజ్ఞలూ, చివాట్లూను.

నా కోరికలు తిన్నవాళ్ళలో ముఖ్యులు వాళ్ళిద్దరు. సగం చచ్చి బతికినందుకు కారణం వాళ్ళేను.

చదివి బాగుపడి నన్ను నేను వుద్ధరించుకోవాలనే తపన గలవాడిని. నన్ను నేను చంపుకోడం యెలా సాధ్యం? పరిస్థితులు అనుకూలించక చదువుమీద శ్రద్ధ చూపించలేని మాట వాస్తవం. ఆ పరిస్థితులకి కారణ మేమిటి?

ఇవన్నీ అన్నయ్య ఆలోచించలేదు. తొందర మనిషి. తప్పేనన్న సాకుతో చదువు మాన్పించేడు. హైస్కూలు చదువుతో నా కోరికల మనిషి చచ్చిపోయేడు.

మళ్ళా స్కూలు తెరిచేంతవరకూ నోరువిప్పలేదు. ఒదినా, అన్నయ్యల సాధింపులు విన్నాను. ఈ లెల్లాటి మాటల్ని గుండెల్లోనే దాచుకున్నాను. కానీ, స్కూలు తెరిచే ముందు రోజు కోరిక గొంతులో నిలిచింది. అడిగేను —

"అన్నయ్యా! నన్ను చదివించు."

"అన్నయ్య రుద్రుడయ్యేడు.

"ఇలా యేటా తప్పుతూంటే నిన్ను పోషించేందుకు మా దగ్గిర బంగారు గనులేవు. ఈ యింటిపడుచు చేసిన నిర్వాహకం చాలదన్నట్టు నువ్వో హడవి మమ్మల్నుద్ధరించేందుకు తయారవుతున్నావు" ఒదిన మంచం దిగకుండానే అనేసింది.

ఆ క్షణంలో కసికొలొంగిపోయిన మాటనిజం. నోరుజారేనన్న నింద నెత్తినరుద్దేడు అన్నయ్య. నేనన్నదిది —

"నే నెందువల్ల తప్పేను. ఈ యింట్లో చాకిరీ చేయడంవల్లా, మీకు నౌఖరు నవ్వడం వల్లాను."

అన్నయ్య నన్ను కొట్టేడు. ఒదిన యేడ్చింది. నన్ను కొట్టినందుకు కాదు. నేను నోరెత్తినందుకు. అంతలేసి మాట లన్నందుకు. వచ్చేదుఃఖాన్నీ, కసినీ, అసహాయతనీ దాచేసు కున్నాను.

ఆనాటినుంచీ నేను మరింత హీనంగా బ్రతకవలసి వచ్చింది. అనుక్షణం దెప్పిపొడుపు మాటల్తో కృంగిపోవలసి వచ్చింది. ముష్టెత్తి బతుకుదామనుకున్నాను. రాత్రిపూట రిక్షా లాగి, పగలు చదువుకుందామనుకున్నాను. చాలా అను కున్నాను. ఏమీ చేయలేకపోయాను.

ఓనాడు – ఒదిన హితబోధనలను ఆలకించి అన్నయ్య అన్నాడు —

"ఎన్నాళ్ళని చెప్పి యింట్లో గోళ్ళు గిల్లుకుంటావ్? ఏదైనా ఉద్యోగం చూసుకోరాదుట్రా!"

"ఉద్యోగం ఏ ఉద్యోగమొస్తుంది నాకు? ఎవరిస్తారు? కలక్టరవ్వాలని కోరలేదు. పంకాకింద కూచుని పదిమందిని అజమాయిషీ చెయ్యాలని అనుకోలేదు. మామూలు ఉద్యో గిగా బతుకుదామనుకున్నాను. అన్నయ్యలా బతుకుదామను కున్నాను.

అది ఆ పరిస్థితుల్లో కలగానే నిలిచిపోయింది. 'ఉద్యో గం చూసుకోరాదుట్రా' అని అన్నయ్య చాలా తేలిగ్గా అనే శాడుకానీ, ఆ మాటన్న అన్నయ్యకీ తెలుసూ నేనందుకు అర్హుడనికానని.

నా పాలిటి యమరాక్షసిలా నడుస్తూన్న కాలం నా కోసం ఆగిపోదు. చాలాకాలం తర్వాతగాని దేవుడు నా మొరాలకించలేదు. హైద్రాబాద్‌నుంచి ఉత్తరం వచ్చింది. పరపతిని పెంచుకున్న కొండలాంటి మావయ్య రాసిన ఉత్తరం నాకు వెయ్యేనుగుల బలాన్నిచ్చింది.

ఆ నగరంలో నాకో ఉద్యోగం చూపించగల బాధ్యత తాను తీసుకున్నట్టు రాశారు. "వున్నపళంగా నన్ను పంపించేయమని" అన్నయ్యని ఆదేశించేరు. ఆ క్షణంలో - చచ్చిన నా కలల మనిషి మళ్ళా బతికేడు. అదీ అంతులేని రంగులకల ప్రారంభమయ్యింది.

నేనూ ఉద్యోగస్తుడిని. ఉద్యోగంచేస్తూ పెద్దచదువులు చదువుకోడానికి అవకాశం అక్కడ బాగావుంది. చదివి బాగుపడిపోయిన నేను నా కళ్ళముందు వెలుగుతూ నించున్నాను.

తెల్లచొక్కా, తెల్లపరాయి వేసుకున్నాను. ఎడంచేతికి ముచ్చటైన వాచీవుంది. అందమైన నా ఉంగరాలజుత్తు నిగనిగలాడుతోంది. జుత్తునుంచి వచ్చే ఖరీదైన తలనూనె వాసన మనసుకి హాయిగావుంది. రోడ్డుమీద అన్నయ్యకంటె దర్జాగా నడుస్తూన్నాను. చేతిలో ఆఫీసు ఫైలు నన్నుద్ధరించేదిగా వుంది. జనం రద్దీగా వున్నచోట అకస్మాత్తుగా ఆగిపోయేను. ఎవరు? ఎవరది?

అక్కయ్యా!

అక్కయ్య గుర్తుకు రావడంతో నాకల ఆగిపోయింది. ఉద్యోగం వచ్చిన తర్వాత అక్కయ్యని వెతికి ఆ దేవతకాళ

మీద పడిపోవాలి. 'నేనున్నాను అక్కయ్యా! తోడు నేనున్నాను. నా చిన్నతనంలో, నా అజ్ఞానంలో, నా అసమర్థతలో నువ్వెళ్ళిపోయేవు. నిన్ను వెళ్ళగొట్టేరు. నేనిప్పుడు అన్ని విధాలా పెద్దవాడి నయ్యేను. మావయ్య దయవల్ల ఉద్యోగం సంపాయించి స్వశక్తిమీద చదివి హోదాని పెంచుకుని నీ ముందు మేరుపర్వతంలా నించున్నాను. నన్ను గుర్తుపట్టలేదా. నేను నీ తమ్ముణ్ణి నీ చిట్టిని.'

గుండె బరువుగా ఉండటంతో మావయ్య రాసిన ఉత్తరాన్ని గుండెకి హత్తుకున్నాను. అది నా పాలిట అదృష్ట దేవత. అంతలోనే అన్నయ్య వచ్చేడు —

"ఎన్ని వగలు పోతున్నావురా! పట్టపగలే కలలు కంటున్నావు. ఆకాడికి, ఇన్నేళ్ళూ యిక్కడ కష్టపడిపోయినట్టు. వెళ్ళిరా" అన్నాడు ఈసడింపుగా.

అన్నయ్య, వదినా నన్ను వదిలించుకున్నందుకు ఆనందించే ఉంటారు. బానిస అమాయకత్వాన్ని భరించగలరు గానీ, హక్కులూ, విధులూ, న్యాయం చట్టం — ఇవన్నీ తెలిసిన బానిసని యే యజమానీ భరించలేడు. అందుచేతనే వాళ్ళిద్దరూ ఆనందించి ఉంటారు. రైలెక్కే ముందు కూడా అన్నయ్య కళ్ళలో ఆప్యాయతని చూడలేదు నేను.

హైద్రాబాద్ చేరేను. ఇంద్ర భవనం లాంటి మావయ్యా వాళ్ళ యింట్లో అడుగు పెడుతూండగా భయం వేసింది. ఇంత హోదాలో బతుకుతూన్న మావయ్య అండన నేనెలా ప్రవర్తించాలి?

మావయ్య దేవుడులాటి మనిషి. భయంతో ఒణికిపో తూన్న నన్ను మందహాసంతో హెచ్చరించేరు. 'ఈ యిల్లు నీది. ఈ యింట్లో నువ్వా ఒహడివి' అనే భావం ఆయన మందహాసంలో స్ఫురించింది.

అత్తయ్య నాతో చనువుగా మాట్లాడకపోయినా వేణు బావా, సుగుణమ్మ నన్ను కొత్తగా చూచేవారు కానేకాదు. వేణుబావ డాక్టరీ పూర్తిచేసేడు. సుగుణమ్మ కాలేజీ చదువు తోంది.

బొమ్మల్లా వుంటా రిద్దరూ. ఖరీదైన శరీరాలువాళ్ళవి. విలువైన మనసులు వాళ్ళవి. నా అంతస్తెక్కడ? నే నెంత? అయినా వాళ్ళ అభిమానంతో యివన్నీ మరిచిపోయేను. నన్నింతి అలరింపజేస్తోన్న అదృశ్య శక్తులు వెయ్యి దేవుళ్ళకి చేతులు రెండూ జోడించేను.

హైద్రాబాద్ ఒచ్చి రెండు నెలలు గడిచేయి.

మావయ్య యిరవై నాలుగ్గంటలూ యేవో పనుల్లో ఒత్తిడి వుండేవారు. నాకై నేను ఆయనెదుటపడి ఉద్యోగ విషయం అడగటానికి భయం వేసింది.

ఒకరోజు వేణుబావ నాతో అన్నాడు.

"నువ్వు కాఫీ బ్రహ్మాండంగా చేస్తావు."

సిగ్గువేసింది.

"అవునూ... ఈ వంటా వార్పూ నేర్చుకుందికి యెన్నాళ్ళు పట్టిందేవిటి? ఎవరిదగ్గిర నేర్చుకున్నావ్. మొన్న మధ్య నువ్వుచేసిన వంకాయకూర లవ్లీగావుంది. చెప్దామను

కుంటూనే మర్చిపోయేను. మా అమ్మకూడా అల్లా వండ దనుకో!" అన్నాడు నా కళ్ళలోకి చూస్తూ.

"అన్నయ్యా వాళ్ళింట్లో నేనే వంటచేసే వాడిని. అయితే వాళ్ళెప్పుడూ నన్ను మెచ్చుకోలేదు."

"వాళ్ళ మొహం వాళ్ళగేం తెలుసు రుచి"

బావ నన్ను ఆకాశాని కెత్తేశాడు. అదే సమయమని నా విషయం చెప్పేను.

"మావయ్యా నాకింతవరకూ ఉద్యోగం వేయించలేదు నువ్వైనా నా మాట ఆయన చెవిలో వేయి బావా! నేనే మాటాడుదామనుకుంటే భయంగా ఉంది!"

బావ పకపకా నవ్వేసేడు.

"భయమేమిట్రా బొత్తిగా! ఆయనేం పులికాదుగా, నిన్ను మింగేయడానికి. సరేలే నేనే అడుగుతాను" అన్నాడు.

నేనొచ్చేస్తూండగా సుగుణమ్మ గదిలో నవ్వులు వినిపించేయి. మరో యిద్దరు స్నేహితురాళ్ళు సుగుణతో యేదో బాతాఖానీ వేస్తూ నవ్వుతున్నట్లు గమనించేను. సరదాగా తలాడిస్తూ వంటగదివేపు వెళ్లబోయేను. అంతలో సుగుణమ్మ నన్ను పిలిచింది. అంతమంది వున్న పరాయి ఆడపిల్లల గదిలోకి బిక్కు బిక్కుమంటూ వెళ్ళేను.

"ఈయనే మా నలమహారాజు. ఇప్పుడు మీారు మెచ్చుకుంటున్న కాఫీ చేసింది సాక్షాత్తు వీరే. వీరు మా మేనబావ గారు. చదువులోనూ, వయస్సులోనూ చిన్నవారుగనక నేను

వారికి పత్నిని కాలేకపోయేను. వీళ్ళిద్దరూ నా ఫ్రెండ్సు బావా!" అన్నది సుగుణ చమత్కారంగా.

మిగతా యిద్దరూ గబగబా నవ్వేశారు. నేను గది లోంచి బైటకొచ్చేశాను. సుగుణ అన్నమాటలు యింకా విని పిస్తూనే ఉన్నాయి. 'వయసులోనూ, చదువులోనూ' చిన్న వాడిని. మరేరకంగానూ కాదు. చాలు. సుగుణకి నాపట్ల హీనభావం లేదు. ఇక్కడ నాకు ప్రాణం పోసే మనుషు లున్నారు.

ఆ మరుసటిరోజు వేణుబావ పుట్టినరోజు పండుగ. పెద్దె త్తున ప్రయత్నాలు. ఆ రోజుఉదయంనుంచీ చేతినిండా పనితగి లింది. ఉక్కిరి బిక్కిరై పోయేను.

ఆ సాయంత్రం వేణుబావ వాళ్ళ స్నేహితులందరూ వచ్చేరు. సగానికి సగంమంది చొప్పున ఆడపిల్లలూ ఉన్నారు. నా చేతిమీదుగా తయారు చేసిన పదార్థాలు వాళ్ళముందుం చేను. కళ్ళు జిగేలుమనిపించే అందరిమధ్య నేను తిరుగు తూంటే యేదో హాయిని అనుభవించేను. ఇల్లంతా కన్నుల పండువగా ఉంది. అక్కడ చేరిన వాళ్ళమాటలూ, నవ్వుల్తో సందడిగానూ ఉంది.

ఎవరో కళ్ళద్దాలాయన నన్ను గురించి వేణుబావతో అన్నాడు —

"అవునోయ్ వేణూ! మీనాయ రేమయ్యా డేమిటి? ఇతన్ని పెట్టుకున్నారు.

3)

"వాడూ, వాళ్ళూరు అలిగి వెళ్ళిపోయేడు. ఇతన్ని మావూరునుంచి పట్టుకొచ్చేం" అన్నాడు వేణు బావ.

"అయితేనేంలే. నాయన్ని మించిపోయేడు."

కళ్ళద్దాలాయన నన్ను మెచ్చుకోడంతో నేను వుబ్బి పోలేదుగానీ వేణుబావ నాగురించిపదిమందిలోనూ అలా చెప్ప డంతో నొచ్చుకున్నాను. నేనీ వూరొచ్చింది వీళ్ళింట్లో వంట మనిషిగా కుదరడానికా? ఈ వూళ్ళో నే చేయబోయే విలువైన ఉద్యోగం ఇదేనా? గబగబా అక్కణ్ణుంచి ఒచ్చేసి వోనూలగా నించుని కళ్ళొత్తుకున్నాను. భుజంమీద చేయి పడటంతో ఉలిక్కిపడి చూసేను.

భాస్కరంగారు!

ఆయన వేణుబావకి స్నేహితులు. ఇద్దరూ కలిసి చదువుకున్నారు. తరచూ ఆయన యిక్కడికి వస్తూంటారు. వచ్చినప్పుడు నన్నూ పలకరించేవారు. ఈ తడవ ఆయననన్ను పలకరించి పోడానికి రాలేదు. పాఠం చెప్పేందుకు కొచ్చానని ఆయనే అన్నారు.

"నువ్వీ స్థితికి వొస్తావని నాకు తెలుసు. గొప్పింటి బిడ్డ లకు నువ్వు పురుగులాటి వాడివి. నువ్విక్కడికి రావడమే పొరపాటు ఇవాళ నిన్ను అవమానపరిచాడని బాధపడకు. ఇలాంటప్పుడే కొంచెం స్థిమితంగా ఉండాలి. అలా ఉండి, నీ బాగుకోసం నీ ప్రయత్నాలు చేస్తూండు. ఏదైనా సాయం కావలిస్తే నన్నడుగు సందేహించకు."

ఈ రెండు ముక్కలూ చెప్పి ఆయన వెళ్ళిపోయాడు.

దుఃఖం పొంగి పొర్లి వచ్చింది. ఆ రాత్రికి రాత్రే మావయ్యని ధైర్యంగా అడిగేయ గలిగాను.

"నాకు ఉద్యోగం కావాలి!"

ఆయన నా వేపు చిత్రంగా చూచి అన్నారు.

"ఉద్యోగం లేకపోతే నీ కొచ్చే యిబ్బందేమిటి చెప్పు?"

"ఇబ్బంది గురించికాదు నే నడిగేది, ఉద్యోగం. నే నీ వూరొచ్చింది ఉద్యోగం కోసం."

"అవునయ్యా! ఉద్యోగం ఎందుకు చేస్తారంటా! పొట్ట నింపుకోడాని కవునా? ఇప్పుడు నువ్వు ఉద్యోగం చేయక పోయినా భోజనం జరుగుతుంది కదా! మరింకెందుకలా ఆవేశ పడతావ్. మాతోపాటే ఉండిపో. ఇంట్లో వాళ్ళం ఏంతింటు న్నామో ? అదే నువ్వూ తిను. సరిపోలే."

మావయ్య మాటల్లో దాగిన తిరకాసు నాకర్థ మయ్యింది. నా గొంతులో అసహాయత నిండుకున్నది. ఏం మాటాడాలో తెలిసిందికాదు.

"ఈమాత్రందానికి అన్నయ్యనువదిలి రావాలా నేను. వాళ్ళూ నా పొట్టకింత పెట్టి పోస్తూన్నారుగదా! కానీ నా ఉద్దేశం అదికాదు మావయ్యా! మీ అందరి దగ్గరా వూడిగం చేయాలనికాదు. నాకు చాలా కలలున్నాయి మావయ్యా. వాటికోసమే బ్రతుకుతున్నా నేను. నన్ను బ్రతకనివ్వండి! మావయ్యా! బ్రతకనివ్వండి."

మావయ్యకి కోపం ఒచ్చింది.

"పెద్దంతరం చిన్నంతరం లేకుండా కూస్తున్నావురా నువ్వు. ఆనాడు మీ అప్ప యిల్లాగే మొరిగి యిప్పుడు నెత్తి మీదికి తెచ్చుకుంది. దాని మొగుడు చావు బతుకులమధ్య నలిగిపోతూంటే డబ్బు పంపు మావయ్యా, మందులుకొనాలి మావయ్యా అని రాసింది. ఆనాడు నేనుగానీ, మీ అన్నగానీ కనిపించలేదు. ఈనాడు మేం కావలసివచ్చాం. ఇదిగో ఉత్తరం చదువుకు నేడువ్. దాని కుక్కబతుకు తెలుసును బుద్ధి తెచ్చుకుంటావ్. ఇక్కడ నే చెప్పినట్టు పడుండు. లేదూ – నువ్వూ ఆ దిక్కుమాలిన చావుకే నోచుకో: పో... రేపీవేళకి నీ నిర్ణయం చెప్పు."

ఇది కుట్ర, పక్కా దగా, మోసం. అన్యాయం.

* * *

నా నిర్ణయం మావయ్యకి తెలిసే ఉంటుంది!

ఇక్కడ బావగార్ని చూస్తూంటే గుండె తరుక్కుపోతోంది. మంచానికి అంటిపెట్టుకున్నారాయన. రోజు రోజుకీ ఆయన స్థితి భయంకరంగా తయారవుతోంది.

అక్కయ్య కళ్ళల్లో మునుపటి వెలుగు లేకపోడానికీ. అక్కయ్య మాటల్లో మునుపటి సందడి లేకపోటానికీ బావ జబ్బే కారణమని చెప్పగలను. ఇరవై నాలుగ్గంటలూ బావని చూస్తూ కూర్చుంటుంది. దీనికితోడు చిట్టిగాడి అల్లరొకటి.

ఇదీ నా అక్కయ్య ఇల్లు!

ఈ ఇల్లు చేరినది మొదలు నాకో క్షణమైనా తీరుబడి చిక్కడం లేదంటే ఒప్పుకుంటాను. వంటా వార్పూ, బాబుని బుజ్జగించడం, మందులు తీసుకురావడం—అన్నీ, అంతా నేనేనంటే అవునంటాను.

ఒక్కటి మాత్రం నిజం. నే నింతకు మునుపు రెండిళ్ళలో 'ఊడిగం' చేశాను. అభిమానం చంపుకొని కొంతా, భయంచేత కొంతా, ఫలించని ఆశచేత కొంతా నేను నౌకరీ సన్యాసిగా ఆ యిళ్ళలో చెల్లుబడి అయ్యేను. కానీ - యిది వేరు.

ఇది నా ప్రాణంలాటి అక్కయ్య ఇలు. నా సేవవల్ల మా బావకి స్వస్థత చిక్కుతుందనే ఆశకి నా సర్వాన్నీ అర్పించగలను. చదువుకుని బాగుపడి, ఉద్యోగంచేసి_వగైరా నా కమ్మటి కల లెవర్నుద్ధరించటానికి? నన్నూ, మా అక్కయ్యనీ అలాంటి_అక్కయ్యకి యిప్పుడు నే నెంత చాకిరీ చేసినా అది నా నెత్తుర్ని చల్లపరచదు. నా అభిమానాన్ని తినే యదు. పైపెచ్చు నా మనసులో అమోఘమైన తృప్తొకటి నిలిచిపోతుంది. దేవతలాంటి అక్కయ్య అవసరాలకి నా చాతకొచ్చిన సాయం చేశాననే ఆనందం స్థానం చేసుకుంటుంది.

కాని భాస్కరంగారు యివన్నీ ఏ పట్టాన గ్రహించలేకపోయారు: నామీద ఆయనకున్న వాత్సల్యం మెంత విలువయినదో తెలియజేసుకున్నాడేగానీ, ఆయనలా అన్నతర్వాత నా మనసెంత బాధపడుతుందో తెలుసుకోలేకపోయేరు.

ఈ వూళ్ళోనే ఆయన కలిశారు. బావగారికి మందు

తీసుకొస్తుండగా, మా వీధిలోనే ఆయన నన్ను చూసేరు. గబ గబా నా దగ్గరకొచ్చి అన్నారు—

"నువ్వు వెళ్ళిపోతున్నట్టు నాకు చెప్పగూడదూ!"

మాటాడలేదు నేను.

"ఊ...ఇక్కడేం ఉద్యోగం చేస్తున్నావ్ మీ అక్కయ్యగారింట్లో వెట్టిచాకిరీయేనా!"

"డాక్టరుగారూ!"

అరిచేసేను. నా కళ్లు చూచి ఆయన కొంచెం సర్దుకున్నారు. ఆ తర్వాత నేను సిగ్గుపడ్డాను.

"క్షమించండి, మీరోమాటు మా బావగార్ని చూడండి. మా యిల్లిక్కడే. మా అక్కయ్యని కూడా చూద్దురుగాని. చూసి మీ నోటికొచ్చినట్టు అనేయండి. అప్పుడు నేను బాధపడను. రండీ, డాక్టర్‌గారూ!"

అదే వేరొకరయితే_నా పరిస్థితిని యింత విపులంగా చెప్పే అవసరముండేది కానేకాదు. ఆయన మనసున్న మంచి మనిషి. మంచి మనుషుల్ని ఆయన అపార్థం చేసుకోడం నా కిష్టంలేదు. అందుచేతనే మా యింటికి తీసుకెళ్ళి, అన్ని పరిస్థితులూ వివరించి చెప్పేను.

ఆయ నేమనుకున్నాడో ఏమో! మరేం చెప్పలేదు. బావగార్ని పరీక్ష చేశారు. చిట్టి బుగ్గమీద చిటికె వేశారు. చేతులూపుకుంటూ బైటకొచ్చారు. నేనాయన్ను అనుసరించేను.

"నీకు చదువుమీద అభిలాష వున్నట్లు నువ్వు నాతో చాలాసార్లు చెప్పేవు. నీమీద జాలి కలగడానికి కారణాలు చాలా ఉన్నాయి. ఇవన్నీ నేను ప్రత్యేకించి చెప్పను. నువ్వు చదువుకునేందుకు ఏర్పాటు చేద్దామనుకున్నది నిజం. ఆ మాట నీతో చేద్దామనుకునేంతలో నువ్వీవూరు వొచ్చేశావ్. ఇప్పుడు..." ఆయన నేదో చెప్పబోయేడు.

ఆయన మాటకి అడ్డు తగిలాను.

"వద్దు డాక్టరుగారూ! నా కిప్పుడా కోరికలేదు. నా క్కావలసింది మా అక్కయ్య సుఖం, మా బావని మీరు చూశారు. మీకు చేతనయిన సాయం మీరు చేయండి. మా బావని బ్రతికించండి అది చాలు. అదే చాలు."

నా భుజం తట్టారాయన. వెళ్ళిపోతూ అన్నారు, "భూమ్మీద చాలామంది దురదృష్టవంతులుపుడతారు వాళ్ళని బాగుచేయడం మానవ సాధ్యం కాదు."

ఆయన వెళ్ళిపోతూ అన్న మాటలు ఎవర్నిఉద్దేశించి? నా దౌర్భాగ్యం గురించేనా? లేక మంచంమీదవున్న బావ నుద్దేశించా?

భగవంతుడా! ఆయనన్న మాటలు నాకు సంబంధించినవని చెప్పు! నేనే దౌర్భాగ్యుడిని, నేను...

—ఆంధ్రసచిత్ర వారపత్రిక 29-10-65